క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్‌సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు, కొత్త లైన్ పనులు చేపడుతున్నట్లు, ఈ క్రమంలో జన్కాపూర్ ఎస్సీ కాలనీ, పోచమ్మ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. పేర్కొన్నారు.

నేడు అయ్యప్ప మహాపడి పూజ

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప స్వాములు శ్రీధర్‌రెడ్డి, ప్రకాష్, సుధాకర్‌లు తెలిపారు. గురుస్వాములు ముసునూరి సూర్యభాస్కర శర్మ, సాయి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పద్దెనిమిది మెట్ల పడిపూజ నిర్వహించడం జరుగుతుందన్నారు.

మూతపడిన ఎమ్మార్సీ కార్యాలయం



తాళం వేసిన ఎమ్మార్సీ కార్యాలయం

లింగాపూర్: సర్వశిక్ష అభియాన్ సిబ్బంది సమ్మె చేయడంతో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం పనులు ముందుకు సాగడం లేదు. రోజువారి పాఠశాలల తనిఖీ, డేటా ఎంట్రీ, మధ్యాహ్న భోజన వివరాలు, నమోదు, ఆధార్ ఎంట్రీ, తదితర సేవలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని కోరుతున్నారు.

హిందీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న హిందీ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి అర్హత గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హెచ్‌పీటీ, పీజీ, టెట్ అర్హత ఉండాలన్నారు. వివరాలకు 81065 12531 సంప్రదించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక



ఇంద్రవెల్లి: ఎన్నికైన సభ్యులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఐకేపీ వీవోఏల నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయంలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మండల ఐకేపీ వీవోఏల జేఏసీ కమిటీ అధ్యక్షుడిగా షేక్ ఫెరోజ్, ప్రధాన కార్యదర్శిగా కొట్నాక్ భారిక్‌రావ్, ఉపాధ్యక్షురాలిగా గిరి మతుర, కోశాధికారిగా ఆత్రం నందిని, సభ్యులుగా జైపాల్, వినోద్, రాందాస్, జానకి, సునీత, జల్‌దేవి, విజయలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీవోఏల న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాడడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

గిన్నేర రాయిసెంటర్..

ఇంద్రవెల్లి: మండలంలోని గిన్నేర రాయిసెంటర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం గిన్నేర రాయిసెంటర్ పరిధిలోని గ్రామాల పెద్దలు సమావేశమయ్యారు. గిన్నేర సార్‌మేడిగా మెస్రం దుర్గు, ఉప సార్‌మేడిలుగా కొడప శ్రీరాం, కుంర లక్ష్మణ్, గిత్తేదార్‌గా మడావి లక్కు, ఖజానదార్‌గా యేర్మ జంగు, సలహాదారుగా హెరేకుమ్రం రామారావ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేస్లాపూర్ రాయిసెంటర్ గిత్తెదారు కొట్నాక్ బారిక్‌రావ్, గ్రామపెద్దలు కొట్నాక్ దేవ్‌షావ్, మెస్రం ఆనంద్‌రావ్, కొరెంగా సుంగు, మెస్రం ఇస్తారి, మెస్రం భీంరావ్ పాల్గొన్నారు.

ఘనంగా కలశం ఆవిష్కరణ వేడుకలు

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో కలశం ఆవిష్కరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా డొంగర్‌గామ్, భీంజితండా గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం సిర్పూర్(యూ)మండలంలోని కలశంకు ప్రత్యేక పూజల చేసి ఆవిష్కరించారు. ఆయా గ్రామాల భక్తులు కలశం ఆవిష్కరణ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెందోర్ బాదుపటేల్, జాదవ్ హచ్చునాయక్, కోవ భీంరావ్, జావవ్ లింబాజీ, జాదవ్ దశరత్‌నాయక్, ఆర్క సెడ్మ రావ్, జాదవ్ ధన్‌రాజ్, మడావి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

తెల్లబోయిన తెల్ల బంగారం

- కూలీలు దొరకక అన్నదాత ఇక్కట్లు
- చేలలోనే ఎండుతున్న పత్తి



ఒకసారి ఏరివేతకే ముగిసిన పత్తి

కెరమెరి: ఆరుగాలం శ్రమించి పండించిన తెల్లబంగారం తెల్లబోతుంది. ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన అన్నదాత ఇప్పుడు పత్తి తీసేందుకు కూలీలు లభించక ఇక్కట్లు పడుతున్నారు. దీంతో రోజుల తరబడి పగిలిన పత్తి చేలలోనే ఉండి పోతుంది. కెరమెరి మండలంలో మొత్తం 6,400 రైతులుండగా.. ఈఏడాది 24 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అందులోనే అంతర పంటగా 6,000 ఎకరాల్లో కంది సాగు చేశారు. 1000 ఎకరాల్లో పెసర, 300 ఎకరాల్లో మినుములు, 700 ఎకరాల్లో జొన్న, 60 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. పూర్తిగా వ్యవసాయాధారిత మండలమైన కెరమెరిలో 95 శాతం రైతులే ఉన్నారు. అత్యధిక రైతులు బీటీ విత్తనాలు వేశారు. మండలమంతా అన్నదాతలు దాదాపుగా ఒకేసారి విత్తనాలు నాటడం వల్ల పత్తి కూడా ఒకేసారి చేతికివచ్చింది. దీంతో పత్తి తీసేందుకు కూలీలు లభించక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్..

వారం రోజుల క్రితం వరకు పత్తి తీసే కూలీలకు కిలో రూ. 8 చెల్లిస్తుండగా.. ప్రస్తుతం కూలీల కరువుతో కిలోకు రూ. 10, 12 చెల్లిస్తున్నారు. అయినా కూలీలు లభించడం లేదు. కుటుంబసభ్యులతో రోజుల తరబడి పత్తిని ఏరుతున్నారు. వేల రూపాలు వెచ్చించి చేతికొచ్చిన పంటను తీసేందుకు ఇబ్బంది పడుతున్నమంటూ.. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క ఏరివేతకే..

ఈసారి గతంలో ఎన్నడు లేని విధంగా ఒక్క ఏరివేతకే పత్తి అయిపోతుంది. తుఫాన్ ప్రభావంతో పూత, కాయ రాలేదు. కాసిన కాయలు కూడా ఒకేసారి పగలడంతో ఒక్క ఏరివేతకే పత్తి అయిపోయింది. దీంతో పొలాలన్ని బీడు భూములుగా మారుతున్నాయి. అనేక ప్రాంతాల్లో కాయలు లేక ఖాళీ మొక్కలే దర్శనమిస్తున్నాయి.

దిగుబడి తగ్గింది



ఈసారి వర్షాల వల్ల పత్తి రంగుమారింది. ఫలితంగా దిగుబడి తగ్గింది. మార్కెట్లో ధర లేకపోవడం, దిగుబడి కూడా తగ్గడంతో ఈఏడాది చాలా నష్టపోవాల్సి వస్తుంది. ఉన్న పత్తిని ఏరుదామంటే కూలీలు లభించక కష్టమవుతుంది.

– మడావి రఘునాథ్, రైతు, మెట్టపిప్రి

కొత్తపల్లికి బయలుదేరిన రగ్‌జోల్ యాత్ర



యాత్రకు స్వాగతం పలుకుతున్న లంబాడాలు

కెరమెరి: లంబాడాలను చైతన్యం పరిచేందుకు చేపట్టిన ప్రజారగ్‌జోల్ యాత్ర గురువారం కెరమెరి నుంచి నార్నూర్ మండలం కొత్తపల్లికి బయలుదేరింది. ఉదయం మండలంలోని చందుగూడ నుంచి ప్రారంభమైన యాత్రకు లంబాడా యవతీ, యువకులు, ప్రముఖులు బ్రహ్మరథం పట్టారు. సేవా లాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. లంబాడాలను చైతన్యం పర్చడంతో పాటు సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు యాత్ర చేపట్టినట్లు రాంబాబు తెలిపారు. నాయకులు రూప్‌లాల్, వెంకట్, రమేశ్, బలిరాం, తిరుపతి పాల్గొన్నారు.

‘వ్యసనాలకు దూరంగా ఉండాలి’



మాట్లాడుతున్న ఎస్సై మాధవ్ గౌడ్

తిర్యాణి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై మాధవ్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని సుంగాపూర్ గ్రామంలో సామాజిక అంశాలపై పోలీసు కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నెంబర్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె 17వ రోజుకు చేరుకుంది. రోడ్లను ఊడ్చి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, జీవిత బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా, పదవి విరమణ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. సమ్మెకు టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సంఘీభావం తెలిపి మద్దతుగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్, జలపతి, శంకర్, రవీందర్, తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేష్, ప్రశాంత్, మల్లేష్ రమాదేవి, ధర్మయ్య పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతులు చేయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రెబ్బెన: వట్టివాగు కాలువలకు మరమ్మతులు చేయించి, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం వట్టివాగుకు ఎగువ ప్రాంతాల్లో బొగ్గు ఉత్పత్తి చేపట్టి ఓబీ మట్టిని ప్రాజెక్టులోకి వదలడంతో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందన్నారు. దీంతో పంటలకు పూర్తిస్థాయిలో నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, శ్రీధర్, వెంకటేశ్, భరద్వాజ్, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాక్సింగ్ డే



బహుమతులు అందజేస్తున్న సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ ఎఫ్ కాలనీలో ముత్తు మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాక్సింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ హాజరు కాగా, ఇటీవల జరిగిన బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సీఐని సన్మానించారు. బాక్సింగ్ నేర్చుకోవడం వల్ల శరీర దారుఢ్యంతో పాటు ఆత్మస్థైర్యం పెరిగి మానసిక ఉత్సాహంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ముత్తు బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు వేముర్ల మధు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ శివకుమార్ నాయర్, మధురై శేఖర్, కోశాధికారి రమాకాంత్‌యాదవ్, జయేందర్, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని వేణునగర్ కాలనీలో రూ. 34 లక్షలతో, అదే విధంగా లక్కారం గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యుం, ప్రభాకర్‌రెడ్డి, మర్సుకోల తిరుపతి, కలీం, నర్సయ్య, రజేశ్, రాజేశ్వర్, ఎక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

చదువు కోసం రూ. 50 వేల ఆర్థిక సాయం

దివంగత ఆదివాసీ ఉద్యమ నాయకుడు ఉయిక సంజీవ్ కుమార్తె చదువు కోసం రూ. 50 వేలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గురువారం అందచేశారు. ఉయిక సంజీవ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతా మాత్రంగానే ఉండడంతో కుమార్తె చదువు కోసం ఆర్థిక సాయం చేశారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని అమ్మాయికి సూచించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై

తాంసి: గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని భీంపూర్ ఎస్సై కలీం అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్ గ్రామంలో జైభజరంగ్ కబడ్డీ పోటీలను గ్రామస్తులతో కలిసి ఎస్సై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గిరిజన గ్రామంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంతోశ్, భీంపూర్ మాజీ సర్పంచ్ లింబాజీ, యువజన సంఘం సభ్యులు కేశవ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు..!

- నేర పరిశోధనలో పెరిగిన నిఘా నేత్రాల ప్రాధాన్యత
- నిర్వహణ గాలికి..
- కౌటాలలో తరచూ దొంగతనాలు



కుమురం భీం చౌరస్తాలో పని చేయని సీసీ కెమెరాలు

కౌటాల: ప్రస్తుత రోజుల్లో ఏదో ఒకచోట నేరాలు, దొంగతనాలు జరుగుతునే ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మండల ప్రజాప్రతినిధులు, వ్యాపారుల సహకారంతో పోలీసులు గత ఐదేళ్ల క్రితం కౌటాల మండల కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రస్తుతం వాటిలో కొన్ని పని చేయడం లేదు. అభివృద్ధి పనులు, భారీ వర్షాలు, కోతల బెడదతో నిఘా నేత్రాలకు ఆటంకం కలిగిస్తున్నాయి.

పని చేయని మూడో కన్ను..

కౌటాలలో నిఘా నేత్రాలు నిద్దరోతున్నాయి. కౌటాలలో నేరాలు అదుపు చేసే లక్ష్యంతో పోలీసు శాఖ ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులకు గురికావడంతో దిష్టిబొమ్మలుగా మారాయి. దీంతో నేరాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయి. మండల కేంద్రంలో కోతుల బెడద ఉండడంతో సీసీ కెమెరాల తీగలను, సీసీ కెమెరాలను ధ్వంసం చేస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్, ఎస్టీ కాలనీ, తలోడి చౌరస్తా వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగత కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మరో 50కి పైగా సీసీ కెమెరాలు కొత్తగా ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాలి. పోలీస్ అధికారులు ఆయా షాపుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా పలుమార్లు కేసులను చేధిస్తున్నారు.

కరువైన పర్యవేక్షణ..

నేరం చేయాలంటే శిక్ష తప్పదంటూ భయాన్ని సృష్టించే సీసీ కెమెరాలకు పోలీసులు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. అయితే కమ్యూనిటీ పోలిసింగ్ కింద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా.. వాటి పర్యవేక్షణపై శ్రద్ధ పెట్టడం లేదు. నేరం జరిగినప్పుడు మాత్రమే తనిఖీ చేస్తుంటే నిఘా నేత్రం పని చేయడం లేదని తెలుస్తోంది. ఫలితంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పైన ఆధారపడిన పోలీసులకు కొని సందర్భాల్లో నిందితులను పట్టుకోవడం కష్టమవుతోంది.

దొంగల చూపు.. కౌటాల వైపు..

ప్రశాంతంగా ఉండే కౌటాల పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు విరుచుకుపడుతున్నారు. ఉద్యోగాల నిమిత్తం ఇక్కడకు వచ్చే అధికారులు కౌటాల ప్రశాంతను ఇష్టపడే ఈ ప్రాంతంలో స్థిరపడిపోతుంటారు. గతంలో ఇళ్లకు కన్నాలు వేసి భారీ దొంగతనాలకు పాల్పడిన ఘటనలు పట్టణాల్లో జరిగేవి. ఇప్పుడు కౌటాల చుట్టుపక్కల ఇళ్లలో కూడా దొంగలు తమ చేతివాటం చూపుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దొంగలకు పాల్పడిన దొంగలను పోలీసులు పట్టుకోలేకపోవడంతో వీరి ఆగడాలకు అంతులేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీకెమెరాలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

చిగురిస్తున్న ఆశలు

- భూమి లేని పేదలకు ప్రభుత్వ ఆర్థికసాయం
- 28న మొదటి విడతగా రూ.6వేలు అందిస్తామని ప్రకటన
- ఇప్పటికీ విడుదల కాని మార్గదర్శకాలు



రెబ్బెన(ఆసిఫాబాద్): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రభుత్వ పథకాల అమలుకు కావాల్సిన ఆర్థిక వనరులను సర్దుబాటు చేసుకుంటోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రూ.2లక్షల లోపు వ్యవసాయ రుణాల మాఫీ, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు చేపట్టారు. తాజాగా భూమి లేని నిరుపేదలకు సైతం ఆర్థికసాయం అందించేందుకు అడుగులు వేస్తోంది. ఏడాదికి రెండు విడుతల్లో ఆర్థికసాయం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలోని భూమి లేని నిరుపేదలు, వ్యవసాయ కూలీల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

28న బ్యాంకు ఖాతాల్లో జమ?

కాంగ్రెస్ ప్రభుత్వం భూములు ఉన్న రైతులకు రైతు భరోసా పథకం ద్వారా సంక్రాంతి కానుకగా పంట పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక భూమి లేని కౌలు రైతులు, నిరుపేదలకు సైతం ఆర్థికసాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 28 నుంచి ఆర్థిక సాయం అందిస్తామని ఇటీవల డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఏడాదికి రూ.12వేలను రెండు దఫాల్లో అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడుత కింద ఈ నెల 28 నుంచి రూ.6వేలు చెల్లిస్తామని తెలపడంతో భూమిలేని నిరుపేదల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో లక్షకు పైగా రైతులు ఉండగా, భూమి లేనివారు కౌలుకు వ్యవసాయం చేయడం లేదా కూలీ పనులు వెళ్తున్నారు.

విడుదల కాని మార్గదర్శకాలు

రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని పేదలు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి రూ.12వేల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించినా, ఈ పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. పథకం అమలుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకుంటుందో తెలియటం లేదు. ఏఏ నిబంధనలు విధిస్తారు.. ఏ అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.. వ్యవసాయ భూమి లేదని ఎలా నిర్ధారణ చేస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రభుత్వం లబ్ధిదారులకు ఎంపిక కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మార్గదర్శకాలు విడుదలయితేనే అర్హులపై స్పష్టత రానుంది. అయితే ఈ నెల 28 నుంచే పథకం అమలు ఎలా అమలు చేస్తారనే వేచి చూడాలి. లేదంటే ఈ నెల 30న జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుని పథకం అమలు చేసే అవకాశం ఉంది.

మార్గదర్శకాలు విడుదల చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు, రైతుకూలీలకు సంవత్సరానికి రూ. 12వేలు అందిస్తామని ప్రకటించింది. దానిలో భాగంగా ఈనెల 28న మొదటి విడతగా రూ. 6వేలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపింది. అయితే ఈ పథకం అమలుకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవటం అనుమానాలకు తావిస్తోంది.

– బోగే ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

మాలాంటి వారికి ఉపయోగం

భూమి, జాగా లేక కూలీ పనుల మీదనే ఆధార పడి జీవిస్తున్న మాలాంటి పేదోళ్లకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుంది. సంవత్సరానికి రూ. 12వేలు ఇస్తామని చెప్పడంతో సంతోషం అనిపించింది. అయితే ఎవ్వరికి ఇస్తారో ఎవ్వరికి ఇవ్వరో ఏం తెలుస్తలేదు. దాంతో కొంచెం ఆందోళనగా ఉంది.

– ఎలగతి లక్ష్మి, కూలీ, రెబ్బెన

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని న్యూకాలనీలో అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అచ్చలాపూర్ వేదపండితులు దుద్దిళ్ల మనోహర శర్మ ఆధ్వర్యంలో పండితుల మంత్రోచ్చరణల మధ్య హోమం, బలి, ప్రధానములు, పూర్ణాహుతి, కుంభాభిషేకం, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.